# హోమ్‌సిక్

అందరం కలిసి బయల్దేరి వుంటే బావుండేది పద్మా!" లక్షన్నొకటోసారి అన్నారు మావారు.

నాకు ఎక్కడలేని కోపం వచ్చింది. దాన్ని నవ్వుగా అనువాదం చేసి –"నాలుగు రోజులుండి రావడానికి అందరూ ఎందుకండీ! డబ్బు దండగకదూ?" అన్నాను. ఈ జవాబు కూడా లక్షన్నొకటోసారిదే.

రాయదుర్గం కొండల వెనకాల అయిదుగంటలకే దాక్కొంటున్నాడు సూర్యుడు.

బస్‌స్టాండ్ బాగారద్దీగా ఉంది.

బెల్లంచుట్టూ మూగిన ఈగల్లాగ– అప్పుడే స్టాండులోకి వచ్చిన బస్సును చుట్టుముట్టారు ప్రయాణికులు. మా బుజ్జిగాడూ, చిట్టీ రేగుపళ్ళు తింటూ వాళ్లని వింతగా చూస్తున్నారు. మావారు వెళ్ళవలసిన బస్సు అనంతపురం ఫాస్టు సర్వీసు కావడంవల్ల అంతరద్దీగా లేదు.

అనంతపురంలో విజయవాడ బస్సు దొరుకుతుందంటారా?" మావారిని అడిగాను.

"సామాన్యంగా దొరుకుతుంది. ఒకవేళ అది మిస్ అయితే దావణగేరే టు విజయవాడ బస్సు దొరుకుతుంది."

"అలాగా" అన్నాను.

"డ్రైవరు వచ్చేశాడు బస్సుస్టార్ట్ చేస్తాడేమో" అన్నారు చిట్టిని ఎత్తుకుంటూ.

డ్రైవరు వచ్చాడే కానీ బస్సు ఎక్కలేదు, డోర్ దగ్గరే నిలుచున్నాడు. బ్రహ్మ దేవుడతన్ని అందర్నీ చేసినట్టు మట్టితో కాకుండా తారూ, రాక్షసి బొగ్గూ కలిపి వండి మరీచేసినట్టు నల్లగా మెరుస్తున్నాడు. అతని పెదవులు మరీ నల్లగా వుండి కిళ్ళీ నములుతున్నందువల్లనేమో రాక్షసి బొగ్గుకు నిప్పు అంటుకున్నట్టున్నాయి. కుడి మోచెయ్యి స్టైయిల్‌గా బస్సుకు ఆనించి మరింత స్టైయిల్‌గా కుడికాలును ఎడమ కాలును చుట్టేసి, సిగరెట్‌ని పెదవులకు అంగుళం దూరంలో వుంచుకుని, ఎవరో స్టూడెంట్‌తో డ్రైవర్‌లా కాకుండా బస్ ఓనర్‌లా మాట్లాడుతున్నాడు. గీతోపదేశాన్ని ఎంతో శ్రద్ధగా వింటోన్న అర్జునుడిలా నమ్రతతో వింటున్నాడా స్టూడెంటు.

కొందర్ని చూస్తే కొన్ని అనుభూతులకు లోనవుతాము. మా పాలవాడిని చూస్తే అకారణంగానే వాడిపై జాలి చూపించాలనిపిస్తూ వుంటుంది. మరి, మా వారిని చూస్తే అవసరంగా రెండు ఈటెలమాటల్ని విసరాలని అనిపిస్తూవుంటుంది నాకు. సైకాలజిస్టులు ఈ గుణానికి ఏ పేరు పెడతారో తెలియదు కానీ, ఆ డ్రైవర్‌ని చూస్తే మటుకు హెల్ప్, హెల్ప్ అంటూ అరవాలనిపిస్తుంది. ఇంగ్లీషు సినిమాలో

లాగ నవ్వుతూ మాట్లాడుతూనే దవడమీద రెండు వేస్తాడేమో అనిపిస్తూవుంది. కొంపదీసి కొద్ది క్షణాలలో, ఆ స్టూడెంటు దవడని.....అని అనుకోగానే జాలేసింది ఆ కుర్రాడిమీద.

అందాకా తాగుతున్న సిగరెట్టును కిందికి జారవిడిచి, దాన్ని నిర్దాక్షిణ్యంగా చెప్పుకాలితో రాచేసి, జానపద విలన్లా బస్సులోకి ఎగిరేడు. థాంక్ గాడ్! ఆ స్టూడెంటు నేమీ చేయలేదు.

"వెళ్ళొస్తా పద్మా! పిల్లలు జాగ్రత్త, చిట్టికి మూడు పూటలా టాబ్లెట్లు మింగించడం మరచిపోకు. రేపటికల్లా తగ్గిపోతుందిలే జలుబు" అంటూ చిట్టిని, బుజ్జిగాణ్ణి ముద్దాడి బస్సు ఎక్కారు.

దేవుడు వరమిచ్చినా పూజారి వరమీయనట్టు - డ్రైవరు స్టీరింగ్ ముందు కూచున్నా కండక్టర్ రైట్ అననందువల్ల బస్సు కదల్లేదు.

ఇలా పిల్లల్నీ, నన్నూ వంటరిగా వదిలి వెళ్ళడం ఇదే ప్రథమం. అందరం కలిసే వెళ్ళాలని మొదట పట్టుబట్టారు వారు. నెలకూ, రెండు నెలలకోసారి వందల కొద్దీ మైళ్ళు ప్రయాణాలు చేస్తుంటే సంసారాలు ఏమైపోవాలి. మనమేం దేశ సంచారులమా? అని రణరంగానికి కత్తి ఝళిపించేసరికి అప్పుడు మెత్తబడిపోయి తనొక్కడే వెళ్ళడానికి ఒప్పుకున్నారు.

అసలు వచ్చిన చిక్కేమిటంటే మావారు హోమ్‌సిక్. తల్లిదండ్రినీ, ఉన్న ఊరునీ విడిచి వుండలేరు. చదువుకునే రోజుల్లో ఓసారి మహాబలిపురంకు ఎడ్యుకేషనల్ టూర్ వెళ్ళారట. సముద్రస్నానాల అనంతరం మావారు కనిపించకపోయేసరికి లెక్చరర్లు భయపడిపోయి బెజవాడకు టెలిగ్రామ్ ఇచ్చారట. ఈయన హోమ్‌సిక్ సంగతి తెలీక.

ప్రభుత్వానికి మావారి హోమ్‌సిక్ తొలగించాలని కుతూహలమేమో అందుకే ఆంధ్రదేశంలో ఈ మారుమూల ఊరికి బదిలీచేశారు. దూరం ఆయనకో లెక్కా, సంవత్సరం తిరక్కుండానే ఓ డజనుసార్లు సకుటుంబ సమేతంగా ఏదో ఓ మిషపై ప్రయాణాలు కట్టించారు బెజవాడకి. ఇలా సాగితే ఇక మనం అప్పుల్లోంచి ఈ జన్మకి బయటపడగలమా అన్చెప్పి "ఈసారి మీరొక్కరే వెళ్ళి రండి" అన్నాను.

"మా నాన్నకి జ్వరం అని తెలిసి అందరూ వెళ్ళకుంటే ఏం బావుంటుంది?" అని లా పాయింటు తీశారు.

"సరే మీరు వెళ్ళాక....మామగారికి సీరియస్‌గా వుంటే టెలిగ్రామ్ యివ్వండి. నేనూ, పిల్లలూ వచ్చేస్తాం" అని హామీ ఇచ్చాను.

పూజారి వరమిచ్చాడులా వుంది. దేవుడు బస్సుని స్టార్ట్ చేస్తున్నాడు.

బస్సు కదిలింది.

ఆయన మావేపు దిగులు దిగులుగా చూస్తూ చెయ్యి వూపుతుంటే నా కళ్ళల్లో నీటిపొర కమ్మేసింది.

బస్సు వెళ్ళిపోయింది. మాపిల్లలు వాళ్ళ నాన్నకు ఇంకా టాటా చెబుతూనే వున్నారు.

★ ★ ★

ధన్...ధన్...ధన్... తలుపుకొడుతున్న శబ్దం.

అందుకే నాకు మెలకువ వచ్చినట్టుంది.

టైమ్‌పీస్ అయిదున్నర గంటలు చూపిస్తోంది. తెల్లవారి వెలుగులు మా కిటికీ తెరలతో దోబూచులాడుతున్నాయి.

ధన్...ధన్...ధన్... మళ్ళీ శబ్దం. తలుపులు కొట్టడం, విరగొట్టడం ఒకటి కాదని తెలియని వెధవ ఎవరా అని నాలో కోపం బుసలుకొడుతోంది.

వెళ్ళి తలుపు తీశాను.

ఎదురుగా మావారు...

నా పతి దేవుడు!!!

రెండుక్షణాలు ఊపిరి తీసుకోవడం మరచిపోయాను.

అనీమిక్ పేషెంటులా పాలిపోయిన మొహం, అర్ధగజం లోతుకు వెళ్ళిన కళ్ళూ. ఆ కళ్ళు చూసే ఆదుర్దా చూపులూ, రేగిపోయిన జుట్టూ చూస్తుంటే ఏదో కీడు జరిగిపోయినట్టు శంకిస్తోంది నా మనసు.

"నిన్న సాయంత్రమేగా మీరు బెజవాడ బయల్దేరింది?" చాలా సందేహాలతో నా గొంతులోంచి అప్రయత్నంగా మాటలు వస్తున్నాయి.

నా మాటలు వారికి వినబడ్డట్టు లేవు. సర్రున లోపలికొచ్చేశారు.

"చిట్టికి ఎలా వుంది?" అడిగారు. ఎదురుగా మంచంమీద పడుకుని వున్న పాప చెక్కిలిపై చేయి వుంచుతూ.

"దానికేం నిక్షేపంలా వుంది. రాత్రి నుంచి జలుబు కూడా తగ్గింది. అది సరేకాని బెజవాడ వెళ్ళలా? ఏం?" నా ప్రశ్న నాకే ఎలాగో వుంది. బెజవాడ వెళ్ళుంటే ఇక్కడెందుకుంటారు?

"అందరం కలిసి వెడదామంటే విన్నావుటే. మిమ్మల్ని విడిచి వెళ్ళిన క్షణంనుంచి మీ దిగులే. ముఖ్యంగా చిట్టికి సిరియస్ అయిపోయినట్టూ, నువ్వేమో కంగారుతో ఏడుస్తున్నట్టు నాకు ఒకటే ఆలోచనలు. దాంతో బుర్రవేడెక్కి నంద్యాలలో బస్సు దిగేశాను. ఈ ఊరిదే లారీ వస్తుంటే అందులో వచ్చేశాను."

ఆయన ఏం చెబుతున్నారో వినాలనే ఆసక్తి లేదు నాలో. ఆయన్ని ఎలా కోపగించుకోవాలో తెలియని స్థితిలో పడ్డాను. నష్టపోయిన బస్సుచార్జీల తాలూకు డబ్బు కళ్ళముందు గిరగిర తిరుగుతోంది. ఆయన్నని ఏం లాభం? తల్లిదండ్రులు వున్న యిల్లు ఆయనకి హోమ్ అయితే, ఇది 'స్వీట్‌హోమ్' అన్న విషయం మరిచిపోవడం నాది కదా బుద్ధితక్కువ.

(మయూరి వీక్లీ – 27 జూన్, 1986)